కథానిక

# మాణిక్య వీణ

## గోరా శాస్త్రి

చివరిదాకా చదివి యీ కథలోని సాంఘిక ప్రయోజనం ఏమిటాఅని ప్రశ్నిస్తే నేనేమీ సమాధానం చెప్పలేను. ఈ కథలో సాంఘిక ప్రయోజనం అటుంచి, అసలు ఏ ప్రయోజనమూ లేదు; శుద్ధ నిష్ప్రయోజనమైన కథ. నాతో ప్రారంభమై ఇంకెవరితోనో ముగుస్తుంది. నేను చెప్పేకథలన్నీ సాధారణంగా నాతోనే ప్రారంభం అవుతాయి అది చదివినవాళ్ళకెంత విసుగ్గా వుంటుందో అంతకన్నా విసుగ్గావుంటుంది నాకు. కాని ఏంచెయ్యను? ఈ భూమిమీద ప్రతిమనిషి కథా నాకథే అనిపిస్తుంది. అందులో నాకూఏదో సంబంధం వుందనిపిస్తుంది. ఉత్సాహులైనకొందరు బుద్ధిమంతులు నన్ను ఆ భ్రాంతిలోంచి తప్పించటానికి చాలా ప్రయత్నించారు. పట్టుపట్టి పెద్ద సైజు పుస్తకాలు—సాంఘిక ప్రయోజనంతో క్రిక్కిరిసిపోయేవి, పెద్దపెద్ద ఆదర్శాలను ప్రబోధించేవి—చదివించారు. లాభం లేకపోయింది. యింక నేను బాగుపడనని నిస్పృహతో వదిలేశారు. మళ్లీ ఎప్పట్లా నేనూ నా భ్రాంతీ మిగిలిపోయాం. నాభ్రాంతి చాలా వాస్తవికమైనది. ఆభ్రాంతిలో అప్పుడప్పుడు నాకు యేమిటేమిటో వినిపిస్తాయి. అష్టమిచంద్రుడి వెన్నెల్లో అరేబియా ఎడారుల్లో అర్థరాత్రి నడుస్తున్న ఒంటెల మువ్వలచప్పుడూ; నా జన్మలో నేనెన్నడూచూడని ఆరావళీ పర్వత ప్రాంతాల్లోని దుర్గాలయాల్లో గంటలచప్పుడూ; మహారణ్యంలో మధ్యాహ్నం ఆవరించిన పెను నిశ్శబ్దంచేసే విపరీతమైన చప్పుడూ—యిలాంటివి. ఇంకా అప్పుడప్పుడు రాత్రివేళల మరీ ఒంటరితనంబాధిస్తే, జాగ్రత్, స్వప్న, సుషుప్తావస్థల్లో నేనున్నది ఏదోఅనే సంశయం నన్నువేధిస్తే, అకస్మాత్తుగా నా కొక్కటి వినిపిస్తుంది: ఎక్కడో క్షితిజరేఖకి అవతలనుండి, భూతకాలం అట్టడుగు నుండి—గాలిలో అంతర్హితంగావున్న యుగయుగాల శీతలస్వప్నాల కదలికలకు అనుగుణంగా—ఏదో అలౌకిక వీణాగానం. అది యేం రాగమని ప్రశ్నిస్తారా? మీభాషలో మీరుదాన్ని యేమని పిలుస్తారోగాని, నామట్టుకది నరనారీ హృదయాల్లోని అనాదియైన సనాతన దుఃఖాన్ని చల్లగాఊరడించే అమృతమూర్తి దివ్యానురాగం. ఇక తాళమా? ఏదేవో మనకే తెలియని నిగూఢ ప్రవహ్లికల అనంత సింహద్వారాలను అవలీలగా తెరిపించి, అవతలఉన్న నిశ్శబ్ద మానసమరుభూములకు దారికల్పించే బంగారుతాళం. ఆ వీణానాదం వినిపించినప్పుడల్లా నాకు ఆనందలక్ష్మి జ్ఞాపకంవస్తుంది. ఎంచేతంటే ఆవీణ వాయించేది ఆవిడే.

ఆనందలక్ష్మి యెవరు? అదేచిత్రం. ఆమె ఎవరో నాకూ సరిగ్గా తెలియదు. ఆఖరుసారి ఆనందలక్ష్మిని చూసి చాలాకాలమైంది. నేను చదువుకుందికి ప్రయత్నించే రోజుల్లో ఆమె మా పొరుగింట్లో వుండేది. అప్పుడప్పుడు మా అక్కయ్యకోసం వచ్చేది; అప్పట్లో ఆవిడ వయస్సెంతో నాకు సరిగ్గా తెలియదుగాని—చూస్తే ఆమెకు వయస్సేమిటి అనిపించేది. చందమామ వయస్సెంత? చల్లని కారుణ్యం వయస్సెంత? ఆనందలక్ష్మి వయస్సెంతో నాకు తెలియదుగాని, మొదటిసారి ఆమెను చూచినప్పుడు "ఓహో! మీరా!" అనుకున్నాను—వెంటనే పోల్చుకున్నట్లు. ఆమె వరారోహా కాదు; సింహేంద్రమధ్య అంతకంటె కాదు; కాని నిండైన విగ్రహం; ఆమె యౌవనం ఏదో చల్లని కాంతి వెదజిమ్మే; ఊరడించి శాంతినిచ్చేది; కొందరి సౌందర్యం, ఆఘ్రాణ, యేవో రాగరంజితమైన లాస్యశాలలూ, తాంబూలమైకం, మత్తెకించే అగరువత్తుల వాసన—ఆవేదన, అసంతృప్తి—యీ అనుభూతులు కలిగిస్తాయి. ఆనందలక్ష్మి సౌందర్యం అటువంటిదికాదు; అంతమాత్రాన ఆమె చంద్రకాంత శిలాప్రతిమ అంతకంటెకాదు; ఆనందలక్ష్మినిచూస్తే మనం కోరిక

లకి అవతలిగట్టున వుంటాం; ద్వేషాలు మరచిపోతాం; శత్రువుల్ని క్షమిస్తాం.

అటువంటి ఆనందలక్ష్మిని చుట్టుపక్కల ఆడవాళ్లెందుకో క్షమించేవారు కారు; ఆమెమీద రకరకాల కథలల్లి ప్రచారం చేసేవారు. ఆనందలక్ష్మి భర్త సంపన్నుడైన ఇంజనీరు. అతనికామె రెండవ భార్య. ఆమె కనురెప్పనీడల్లో పదిలంగా అడుగులువేసుకుంటూ, ఆ సౌందర్యాన్ని ఆరాధించడం తప్ప యిక వేరేఆదర్శం లేనట్లుగా ప్రవర్తించేవాడుభర్త. అందుకే ఆమెకుగర్వంఅనేవారంతా. "ఈ నడమంత్రంసిరి అబ్బినవాళ్ళంతా యింతే. పూటకుగతిలేని పుట్టిల్లులోంచి వచ్చిందా, అందుకే ఈగర్వం. డబ్బుకి కక్కుర్తిపడి తండ్రి రెండవ పెళ్ళివాడికిచ్చాడు. ఈవిడగారి ఏపైన విగ్రహం చూసి, తళుకుబెళుకులు చూసి బట్టతల ఇంజనీరుగారు మోజుపడ్డారు. ఈమాత్రానికింత మిడిసిపాటు దేనికి?" అని సత్యాగ్రహం ప్రకటించేవారు. ముదిమికి ముచ్చట్లులావని, పెళ్ళయిన కొత్తల్లో ఇంజనీరుగారు ఆనందలక్ష్మికి వీణ నేర్పించారు. ఆయనచేసిన మంచిపనుల్లో అదొక్కటని ఆ రోజుల్లో అనుకునేవాడిని.

మా మేడ దక్షిణపు గదిలోంచిచూస్తే ఆనందలక్ష్మి పడకగది కనిపించేది. ఖరీదైన వస్తువులతో అలంకరించివున్న ఆ గదిలో తివాసీలమధ్య, చక్కని లేడిచర్మం పరచివుండేది. ఎదురుగా ఎత్తయిన తిన్నెమీద చక్కని నటరాజ విగ్రహం వుండేది. ఎండాకాలపు అరుణాస్త సంధ్యవేళల్లో, వర్షాంధ సాంధ్యసమయాల్లో, శీతాకాలపు మునిమాపు ఘడియల్లో, అజినాసనంపై కూర్చుని ఆనందలక్ష్మి వీణవాయించేది. ఆ ఘట్టాలలో నా తరుణహృదయం ఎందుకో పునీతం అయినట్లనిపించేది. అంత తన్మయురాలై వీణ వాయించేది ఆనందలక్ష్మి. అజినాసనంపై తెల్లని పట్టుచీర ధరించి పారవశ్యంతో ఆనందలక్ష్మి వీణ తీగలలోంచి జనింపచేసిన నాదం వింటే పారిజాతపుష్పవర్షం కురిసినట్లు, క్షీరాబ్ధి పెల్లుబికినట్లు, కోటి పూర్ణేందుబింబాలు మింటమెరసినట్లు నా హృదయం పులకరించేది. అప్రయత్నంగా మనస్సులో "మాణిక్యవీణా ముపలాలయంతీ" అనే స్తుతి స్ఫురణకొచ్చి నా అవగాహన అమృతత్వాన్ని క్షణకాలం ఆకళించుకొనేది.

ఆనందలక్ష్మి భర్త ఎంత అదృష్టవంతుడు!-అనుకునేవాడిని. ఆ మాటకొస్తే ఆనందలక్ష్మి ఎంత ధన్యురాలు! అని సంతోషించేవాడిని. ఈనాటి కొందరు అభ్యుదయవాదులకు, సాంఘిక ప్రయోజనాకాంక్షులకు ఆనందలక్ష్మి జీవితం సంఘానికి అంత ప్రయోజనకారిగా కనిపించకపోవచ్చు; నేటి ప్రమాణాల ప్రకారం ఆమె చదువుకున్నదిగాదు; ఎన్నడూ ప్రజాహితరంగంలో పనిచెయ్యలేదు; కనీసం ఏదైనా ఒక హైస్కూలు వార్షికోత్సవంలో బహుమతులైనా పంచిపెట్టలేదు; ఒక్క కచ్చేరీలో వీణ వాయించలేదు. ఏముంది, ఆమెలో గొప్ప? అని బుద్ధిమంతులు నిలవదీసి అడిగితే నేను సమాధానం చెప్పలేను.

కాని-ఎందుకో నా కనిపిస్తుంది: ఆనందలక్ష్మి మనుగడవల్ల యీ ధరిత్రి నిజంగా ఉపకారం పొందిందని నిబ్బరమైన ఆమె ఆత్మసౌందర్యం, నిండైన ఆమె శరీరసౌందర్యం-ఆమె చరించిన చోట్ల భూమిని మరింత వాసయోగ్యంగా చేశాయి; అది నాకు తెలును; సార్థక జీవనానికంతకన్న యింకేం కావాలి? బహుశా యీ రకం ఆలోచనలు కేవలం నా భ్రాంతి కావచ్చు; అభ్యుదయ వైద్యుల దృష్టిలో చిత్త చాంచల్యం కూడా కావచ్చు; ఆనందలక్ష్మి విషయంలో యిరుగుపొరుగు పరిధిలోని సౌజన్యమూర్తులు తేల్చిచెప్పిన నిజాలే వాస్తవికత కావచ్చు; గతితార్కిక భౌతికవాదులు పరిశోధించి నిర్వచించినట్లు-కేవలం ఆర్థిక పరిస్థితుల ప్రభావంవల్లనే ఆనందలక్ష్ములు ఉదయించి అస్తమిస్తారు. బీదవాడైన తండ్రి డబ్బుకి ఆశించి కూతుర్ని బట్టతల యింజనీరుకిచ్చి పెండ్లిచేశాడు. తక్కిన అర్హతలవల్లకాక, కేవలం డబ్బున్నందువల్లనే యింజనీరు అటువంటి లావణ్యవతిని భార్యగా పొందగలిగాడు. వర్గసంస్కార ప్రభావంనుండి తప్పించుకోలేక ఆనందలక్ష్మి కేవలం కుక్షింభరురాలిగా జీవించి, కాలక్షేపంకోసం వీణ వాయించి సాంఘిక చైతన్యంలేకుండా కాలంగడిపింది.

అటువంటి ఆలోచనలు అంకురించినప్పుడల్లా వేదనతో నా హృదయం మూలుగుతుంది. ఒంటరి

తనం మరీ బాధపెట్టే సమయాల్లో-మానవత్వం పట్ల నమ్మకం చెదిరిపోయి భయపడే నిస్సహాయ స్థితిలో—స్మృతిపథంలో తటిల్లతలవలె కొన్ని మధురానుభూతులు మెరిసి ఊరట కలిగిస్తాయి. అందులో ఆనందలక్ష్మి స్మృతి ఒకటి. ఇప్పుడామె ఎక్కడుందో నాకు తెలీదు. అసలు ఉన్నదో లేదో తెలియదు. అలా అన్నానా? అబద్ధం. ఆమె లేకపోవడమేమిటి? అప్పుడప్పుడు ఆమె మాణిక్యవీణనుండి వెలువడే దివ్యసంగీతం నాకు వినిపిస్తూనే వుంటుంది—వేళగాని వేళల్లో కూడా. ఆమె వీణలోనుంచి జనించిన గానవాహిని ఏమైపోయింది? అది విన్న వారందరి లోనూ వుండి లోలోపల వాళ్ళని సంరక్షిస్తోంది. ఇదంతా నా భ్రాంతే ఐతే, యీ జీవయాత్రలో నేను పోల్చుకుని పులకరించే ప్రతి సౌందర్య లవమూ, ప్రతి అమరక్షణమూ భ్రాంతే. కాలం గడిచిన కొద్దీ యిటువంటి భ్రాంతులే జీవితానికొక వాస్తవికత నిస్తాయనిపిస్తుంది. ఎక్కడున్నారు ఆనందలక్ష్మిగారూ? ఎక్కడుంటేనేం! మీపక్కనే మీవీణ, అనురాగచిహ్నంగా భర్త యిచ్చిన వీణ, వుండేవుంటుంది. మీగురించి లోకానికి చాలా చెప్పాలనివుంది. చెప్పడానికి తగిన మాటలులేవు. ఆనందలక్ష్మి కథ అందరికీ తెలిసేటట్టు లోకానికి ప్రకటించాలని వుంది—మీరిచ్చిన ఆనందానికి కృతజ్ఞతతో. ఎంత అదృష్టవంతులు మీరు! ఏ లోకాల్లో వీణ వాయించి ఎవర్ని తన్మయుల్ని చేస్తున్నారు?

* * *

"ఎవర్నీ లేదు నాయనా! ఈ సమయంకాని సమయంలో నన్ను జ్ఞాపకంతెచ్చుకొని బాధ పడతావెందుకు? నా సంగతి లోకానికి తెలియ చేయాలనే తహతహ దేనికి నీకు? మొదట్లో నువ్వు చెప్పావే—అదేనిజం. ఇటువంటి నిష్ప్రయోజనమైన కథ లోకానికి తెలియజేసి ఏం ప్రయోజనం? అందులోనూ నీకు పూర్తిగా బోధపడని కథ! అందుకే నీలాంటి వాళ్ళ అజ్ఞానసాహసం తలుచుకుంటే బాధ కలుగుతుంది; సర్వజ్ఞులవలె ప్రవర్తిస్తారు. నాలాంటి వాళ్ళ జీవితాలను రకరకాలుగా అర్థంచేసుకుని అంతే సత్యం అనుకుని మీకు తోచిన రీతిగా కథల్లి చెపుతారు. తెలియనివాళ్లు అదేనిజమని నమ్ముతారు. నిద్రపోతున్న మౌనగాథల్ని లేపుతావెందుకు నాయనా? కథకుడివనే భ్రాంతిలోపడి అలా చేస్తున్నావా? నీ తెలివితక్కువకి నీ పాత్రలు లోలోపల ఎంతబాధపడతాయో నీకు తెలుసా? నువ్వెంత పరిశోధించినా, ఎంత నిశితదృష్టితో అర్థంచేసుకుందికి ప్రయత్నించినా, నీకు తెలియని రహస్యాలెన్నో నీపాత్రల జీవితాలలో ఉంటాయి. అవి నీకు కనబడకుండా దాక్కుని, నీ తెలివితక్కువతనానికి నవ్వుకుంటాయి."

"క్షమించండి. ఎవరు మీరు? మిమ్మల్ని నేనెరుగను. ఇంతవరకూ నేను ప్రస్తావిస్తున్నది ఆనందలక్ష్మి అనే ఆవిడవిషయం. అనవసరంగా నా కథకు మీరు అడ్డొస్తున్నారు. పైగా నాకేమీ తెలియదంటున్నారు!"

"తెలియనప్పుడు సరిదిద్దవద్దా నాయనా! నేనే ఆనందలక్ష్మిని!"

"చాలా మారిపోయారే! ఈ భవ బంధాల నుండి తప్పించుకున్నట్లున్నారు? పోల్చుకోలేక పోయాను."

"ఆ నాడే నువ్వు మేలుకున్న రోజుల్లోనే, పోల్చుకోలేక పోయావు. నేడు నీ తృతీయయామ స్వప్నంలో, చైతన్యాంతర సమాధిలో పోల్చుకో గలవా?"

"అలా అనడం అన్యాయం. ఆనాడు మిమ్మల్ని పోల్చుకోలేకేం?... మీ వీణ క్షేమంగా వుందా? ఇంకా సంధ్యాగీతం సాధన చేస్తున్నారా?... మీకు తెలుసునో లేదో, నా జీవితంలో మీ సంగీతం ఒక మధురస్మృతి."

"మంచిది బాబూ! కాని ఇప్పుడు నావీణ మూగవోయింది. నాలో సంగీతం హరించి పోయింది."

"అలా ఎన్నటికీ జరగదనుకున్నాను"

"అందుకే అన్నాను నాయనా!- నీలాంటి కథకుల అజ్ఞానం అపారమనీ! అసలు నాగురించి నీకేం తెలుసు?... ఇప్పుడంతా ఐపోయింది. అన్ని రంగాలూ ముగిసి, యవనికలు దిగిపోయాయి. అభినేతలంతా కాలిగజ్జెలు తీసి అందాల సాలె పట్టులోకి విసిరేశారు. అందుచేత ఇంక నా జీవిత రహస్యాలు కొన్ని చెపుతాను విను నాయనా!

విని—నీ లోకంలో మనుషులు నీకెంతవరకూ అర్థం అయ్యారో బోధపరుచుకో.

నా గురించి నీకు అర్ధసత్యాలే తెలుసు... నా తల్లిదండ్రులు చాలా బీదవాళ్ళని నువ్వు విన్నావు. నిజం. ఆర్థికంగా చాలా బీదవాళ్ళు. కాని నాయనా! తరతరాలుగా మా తండ్రితాతల వంశంలో అంతా మహావైణికులు. నాదోపాసనే జీవితసర్వస్వమూఅనుకుని బతికినవాళ్లు. మానాన్నగారు వీణవాయించి సరస్వతీదేవిని సాక్షాత్కరింపచేసేవాడని ప్రతీతి. అది పోనీలే, ఎవరూ నమ్మని ఆత్మీయ రహస్యం. ఆయన సంస్థానంలో దివాణంలో వీణ నేర్పేవారు. దివాణంలోని ఆడవాళ్ళంతా ఆయనను తండ్రివలె గౌరవించేవారు. రాణీగారికీ సరే, మా నాన్నగారు దైవసమానుడు.

వింటున్నావా? శ్రద్ధగా విను. ఆ రాణీగారు ఆ సంస్థానం జమీందారుకి రెండవ భార్య. పురుష సంతానం లేదని మొదటిభార్యని జమీందారు వదిలేశాడు. ఈ రెండో రాణీగారి గతీ అంతే అయింది. వరసగా ముగ్గురు ఆడపిల్లలు కలిగారు. నాలుగోసారి తిరిగీ ఆడపిల్లే కలిగితే రాణీగారి మొహం యిహ జన్మలో చూడనని జమీందారు భీష్మించుకు కూర్చున్నాడు. భయపడినంతా జరిగింది. నాలుగోశిశువూ ఆడపిల్లేఅయింది. రాజవైద్యుడూ, దాసీలూ, వాళ్ళని కూడగట్టుకుని రాణీగారు మొగబిడ్డ పుట్టి, వెంటనే పోయాడని రాజుగారిని నమ్మింపచేసింది. పుట్టిన శిశువుని, గురువుగారైన మా తండ్రిగారికిచ్చేసి పెంచుకోమని బతిమాలింది ఆయన సరేనన్నాడు. నేనే ఆ శిశువుని.

తెలిసిందా నాయనా? కువిధి వికృతం ఏమిటంటావు? శ్రీమంతుల గర్భానాసాన పుట్టి సామాన్యుల యింట్లో పెరిగాను. మా నాన్నగారు-పెంచిన మహనీయుడే నాన్నగదా మరి-ఆర్థికంగా నిర్ధనుడు కాని అపారమైన మానధనుడు. నా పెంపకానికి దివాణంనుండి ఒక్క తృణమైనా సరే తీసుకుందికి అంగీకరించలేదు. ఏ క్షణంలో నేను తన దుహితనైనానో, ఆ క్షణంలోనే నేను తన వంశాంకురం అయ్యానన్నాడట. రాణీగారు రిచ్చిన ఖరీదయిన వీణ ఒకటి అతి కష్టంతో కానుకగా స్వీకరించాడు.

—కాని నాయనా! ఆ అమృతహృదయుడి యింట్లో ఎంత గారాబంగా పెరిగానని! తన సమస్తశక్తులూ ధారపోసి నాకు వీణ నేర్పాడు. అదే ఆయన నాకిచ్చిన నిధినిక్షేపాలు. అదే నేటి వరకూ నా మనశ్శాంతి కాపాడుతోంది...మా నాన్నగారు హఠాత్తుగాపోయారు. నా వివాహం మా నాన్నగారు చేసిందికాదు; మా అమ్మగారు చేసింది. పాపం—ఆ అమాయకురాలు-ఐశ్వర్యం వున్న యింట్లో అయితే నేను సుఖపడతాననే ఆశతో, కేవలం నామీదప్రేమ కొద్దీ-నాకు యీ రకమైన వివాహం చేసింది.

నా భర్తగారి సంస్కారమే వేరు. కొత్త సంస్కారపు వెల్లువలో స్థితిమంతుడైనాడు. దాని అట్టడుగున ఏదీ ఆధ్యాత్మికమైన ప్రాతిపదిక లేదు. అందుకు ఆయన్ని నేను నిందించటంలేదు, మా ఇద్దరి దురదృష్టానికీ విచారిస్తున్నానంతే. మొదట నన్ను చూసి, అందమైన ఒక ఆటవస్తువుగా మోహించి ప్రయత్నించి తనదిగా చేసుకున్నాడు కాని-కాని ఆధికృతిలేనిదే జీవితంలో ఏ ఆనందాన్నీ అందుకోలేం నాయనా! అది మానవుడి శక్తికే అతీతం అందువల్లనే మా దాంపత్యజీవనంలో మొదటిరోజునుండీ అశాంతి ప్రారంభమైంది. నా వ్యక్తిత్వాన్ని చంపేసుకుని ఆయన సంస్కారం ప్రకారం జీవించడానికి ఎంతో ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. పరిస్థితి యిద్దరికీ ఉక్కిరిబిక్కిరిగానే పరిణమించింది నా సాన్నిధ్యం, ఎడబాటు, రెండూ ఆయనకి దుర్భరంగానే వుండేవి. నాతో యింకో ప్రాణి ఎవరైనా మాటాడినా ఆయనహృదయం గిలగిల లాడిపోయేది. అది గ్రహించి ఆయన సంతృప్తికోసం ఒంటరి జీవితం అలవరచుకున్నాను. అందులోనూ ఆయనకి సాఫల్యంరాలేదు. కూడబెట్టడంతప్ప డబ్బు ప్రయోజనం తెలియని లుబ్ధుడి యినపపెట్టెవలె, ఏ విధంగా చూసినా నే నాయనకు దుఃఖకారకురాలినే అయ్యాను. దాంపత్య జీవనం అలా మా ఉభయులకీ లవలేశమైనా ఆనందాన్నివ్వలేక పోయింది. అందుకే, వీటన్నిటినుండీ తప్పించుకుందుకి వీణాసాధన ఒక తరణోపాయంగా కనబడింది. ఆ వీణనిచూసినా ఆయనకి తగని ఈర్ష్యగా వుండేది. నిర్ధనుడైన మా నాన్నకి

అంత ఖరీదైనవీణ ఎక్కడనుండి వచ్చింది? ఆవీణకీ నాకూవున్న తాదాత్మ్యం ఏమిటి? ఆ సమస్యలో ఆయన మనస్సు యేవేవో జడలురేగిన వికృత రహస్యా లూహించుకుంది. ఇక భరించలేక ఒక రాత్రి నా జన్మరహస్యం ఆయనకి చెప్పేశాను. అంతే. ఆ వైపరీత్యానికి ఆయన సంస్కారం తట్టుకోలేకపోయింది. మనోవ్యాధితో మంచం పట్టారు. మరి కోలుకోలేదు.

అంతే నాయనా నాకథనం! అంతా అర్థరహితమైన రహస్యాలపుట్ట. పోల్చుకోలేక పోయావుగాని, పోల్చుకుంటే మట్టుకు యేం ప్రయోజనం? నన్ను తలుచుకుని నువ్వువూహించుకున్న సుందర స్వప్నం పరికించిచూస్తే లోలోపల యేముంది? దుఃఖకళికల సంచయనం. మధురాతి మధురంగా నువ్వు పరిగ్రహించిన నా వీణాగానం నా మౌనవేదనలు విశ్వదుఃఖంతో కలిపిన శ్రుతి.

అంతేనాయనా, నా కథనం. అర్థమయిందా? ఇప్పటికైనా నువ్వు లోకానికి వినిపించే కథల విషయంలో కొంచెం జాగ్రత్తగావుండు. అనవసరంగా నీపాత్రల హృదయాలను గాయపరచకు. రెండువిషయాలు జ్ఞాపకం వుంచుకో నాయనా! ఎంత నువ్వు సృష్టించిన పాత్రలైనా, సృష్టించిన తరవాత వాటివ్యక్తిత్వం వాటిది. ఇంక యేదో ఆదర్శాన్ని సృష్టించాలని ప్రయత్నించకు. ఏ మానవుడైనా వాక్కుద్వారా యేదైనా ఆదర్శపు వైఫల్యాన్ని మాత్రమే చెప్పగలుగుతాడు. ఆదర్శాన్ని మౌనంగాఅనుభవిస్తాం గాని వాక్కులో చెప్పగలమా? ఆలోచించు! ★

## ఎవరా అమృతమూర్తి?

ఈ యువకుడి కథ మీకు తెలుసునా? ఈ భూమిమీద ఎక్కడో మారుమూల కుగ్రామంలో జన్మించాడు-ఒక రైతుయువతి గర్భవాసాన. పెరిగినది వేరొక గ్రామంలో ముప్ఫై సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ ఒక వడ్రంగిదుకాణంలో పనిచేశాడు. తరువాత ఊళ్లు తిరిగే మతబోధకుడైనాడు. అతడు జన్మలో ఒక్క పుస్తకమైనా వ్రాయలేదు. సర్కారు ఉద్యోగం ఏదీచేయలేదు. ఇల్లు లేదు, వాకిలి లేదు. కుటుంబం అసలేలేదు. ఎన్నడూ పాఠశాల గుమ్మంతొక్కి ఎరగడు. పెద్దపెద్ద పట్టణాలు జన్మలో చూడలేదు. తన పుట్టిన ఊరునుండి రెండువందల మైళ్లు దాటి ఎన్నడూ ప్రయాణం చెయ్యలేదు. గొప్పవాళ్లు చేసే పనుల్లో ఏ ఒక్కటీ అతను చెయ్యలేదు.

యౌవనంలోనే ప్రజాభిప్రాయం అతనికి వ్యతిరేకమైనది. స్నేహితులు విడనాడారు. శత్రువులకు అప్పచెప్పేశారు. పాక్షికమైన విచారణ జరిగింది. ఇద్దరు దొంగలమధ్య యితన్ని శిలువకువేసి మేకులు దిగగొట్టారు. అతను మరణించాక ఇంకెవరి గోరీలోనో పాతిపెట్టారు— అదీ జాలిగుండెగల ఒక స్నేహితుని దయవల్ల.

ఇదంతా జరిగి ఇప్పటికి పంధొమ్మిది శతాబ్దాలకు పైగా అయింది... కాని, నాటినుండి నేటివరకూ, యిన్ని శతాబ్దాలలోనూ,—యుద్ధాలు చేసిన సమస్త సైన్యాలూ, నిర్మించబడిన నౌకాదళాలూ, ఆ మాటకొస్తే నాటినుండి నేటివరకు సమావేశమైన సమస్తరాజ్య శాసన సభలు, సామ్రాజ్యాలేలిన రాజులు, రారాజులు-యిన్నిటి కృషినీ ఫలితాలనూ, లెక్కలోకి తీసుకున్నా— పైన చెప్పిన ఒక్క యువకుడు తన జీవితంద్వారా మానవాళికి చేసిన సేవలో, మానవచరిత్రపై చూపిన ప్రభావంలో శతిసహస్రాంశమైనా కానేరదు.

ఎవరా అమృతమూర్తి?

—(రీడర్స్ డైజెస్ట్‌నుండి)